# నవతరం పరిశోధనలు - 7



## తెలుగు సాహిత్యంలో స్వప్నవృత్తంతాలు - పరిశీలన

**ఎన్.ఎస్.ఎల్. కళ్యాణి శిష్ట్లా**, ప్రసారశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం, ఆంధ్రప్రదేశ్.
**సెల్** : 9663978349. **మెయిల్** : kkalyani1976@gmail.com
**కోర్సు:** Ph.D. **రీసెర్చ్ ఏరియా:** సాహిత్యం
**పర్యవేక్షకులు:** డా. తోట వెంకటస్వామి. **పరిశోధన కాలం:** 2023 నుండి 2027

ప్రాచీన మానవజీవితంలో కలలకు ప్రత్యేక స్థానం ఉంది. వీటినే స్వప్నాలు అని పిలుస్తాం. మానవుడు నిద్రావస్థలో ఉన్నప్పుడు స్వప్న జగత్తులో విహరిస్తూ ఉంటాడు. ఇలాంటి స్వప్నాల ప్రస్తావనలు, వృత్తాంతాలు తెలుగు సాహిత్యంలో అడుగడుగునా కనిపిస్తాయి. వీటన్నింటినీ క్రోడీకరించి శిష్ట్లా కళ్యాణి తెలుగు సాహిత్యంలో స్వప్న వృత్తాంతాలు - పరిశీలన అనే సిద్ధాంత గ్రంథాన్ని రూపొందిస్తున్నారు.

ఈ స్వప్నాల గూర్చి ప్రాచ్య పాశ్చాత్యులు బహువిధాలుగా పరిశోధించి స్వప్న శాస్త్రాన్ని నిర్మించారు. ప్రాచ్యుల అభిప్రాయాన్ననుసరించి స్వప్నశాస్త్రం జ్యోతిష్యశాస్త్రంలో ఒక విభాగం. ఉపాసన మార్గంలో ఉన్నవారికి ఈ స్వప్నాలు ప్రత్యేకమైనవి. పాశ్చాత్యులు స్వప్నశాస్త్రాన్ని మనస్తత్వశాస్త్రంలో ఒక విభాగంగా చూస్తారు. ఇలా భిన్న దృక్పథాలలో స్వప్న శాస్త్రం మనకు కనిపిస్తుంది. ఈ రెండు దృక్పథాలను తులనాత్మకంగా పరిశీలించి శాస్త్రీయ పద్ధతిలో వీరీ పరిశోధన చేస్తున్నారు. పర్యవేక్షకుల సూచనలను అనుసరించి వీరు తమ సిద్ధాంత గ్రంథాన్ని ఏడు అధ్యాయాలుగా విభజించారు. అవి: కలలు; స్వప్న సిద్ధాంతాలు; అష్టాదశ పురాణాలలో కలలు - పరిశీలన; రామాయణ మహాభారతాలలోని కలలు - పరిశీలన; ప్రబంధాలలోని కలలు - పరిశీలన; కవులు, వాగ్గేయకారుల కలలు - పరిశీలన; క్షేత్ర మహాత్మ్యాలలో కలలు - పరిశీలన.

ఈ వినూత్న పరిశోధనకు గాను ప్రాచీన సాహిత్యాన్నంతటినీ పరిశీలించవలసి వస్తుందన్నారు. వాటన్నింటినీ ప్రాచ్య, పాశ్చాత్య దృక్పథాలతో విశ్లేషించడం కొంత కష్టంగా ఉన్నా ఈ పరిశోధన ఆసక్తికరమైనదవ్వడం వల్ల పరిశోధన ఇష్టంగా ముందుకు సాగుతుందన్నారు. పరిశోధకులు వినూత్నమైన రీతిలో ఆలోచించి జిజ్ఞాసను పెంపొందించే విధంగా ఉండే పరిశోధనాంశాలు ఎంచుకుంటే పరిశోధన ఎంతగానో ఆనందిస్తుందని అభిప్రాయపడ్డారు.

**- సంపత్ కుమార్ బానోజి**

# నవతరం పరిశోధనలు - 8



## సుధామూర్తి అనువాద సాహిత్యం – పరిశీలన

**పప్పుల శైలజ,** తెలుగుశాఖ, కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, మైసూరు, కర్ణాటక.
**సెల్:** 9290075488. **మెయిల్:** agresssailaja@gmail.com
**కోర్సు:** Ph.D. **రీసెర్చ్ ఏరియా:** సాహిత్యం
**పర్యవేక్షకులు:** ఆచార్య మొగురాల రామనాథం నాయుడు. **పరిశోధనకాలం:** 2022 నుండి 2026

తొలి మహిళా ఇంజనీర్, పారిశ్రామికవేత్త, మానవత, సమతా భావం మేళవించుకున్న పర్యావరణవేత్త. బాలలలో / యువతలో రానురాను తరిగిపోతున్న కుటుంబ, నైతిక విలువలను, దేశభక్తి భావాలను పునర్జీవింపజేయాలనే అకుంఠిత దీక్షతో రచనావ్యాసంగం సాగిస్తున్న సృజనాత్మక రచయిత్రి పద్మభూషణ్ సుధామూర్తి. వీరి జీవితాన్ని, సాహిత్యాన్ని పరిశీలించిన పప్పుల శైలజ వారి పరిశోధనాంశాన్ని గూర్చి వివరిస్తూ సుధామూర్తి గారి జీవితం, సాహిత్యం ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని అన్నారు. ఒకవైపు సమాజంలోని సమస్యలకు సేవా కార్యక్రమాల ద్వారా పరిష్కారాన్ని చూపుతూ, మరోవైపు ఆ వాస్తవాలను సున్నితంగా రచనలలో చిత్రించడం వీరి ప్రత్యేకత అన్నారు. సరళమైన శైలి, మానవీయ విలువల మేలి కలయికగా ఉన్న ఈ రచనల వలన స్ఫూర్తి పొందిన ఔత్సాహికులైన అనువాదకులు వివిధ భాషలలో సుధామూర్తి గారి రచనలను అనువాదం చేశారని వాటిలో తెలుగు అనువాదాలు కూడా ఉన్నాయన్నారు. ఇందులో ఆధునిక భారతీయ సమాజం ఎలా ప్రతిబింబించింది, భవిష్యత్తు తరాలకు ఈ సాహిత్యం ఎలాంటి సందేశాన్ని ఇస్తుందనే అంశాలను పరిశీలించాలనే సదుద్దేశంతో సుధామూర్తి అనువాద సాహిత్యం - పరిశీలన అనే సిద్ధాంత గ్రంథ రచనకు ఉపక్రమించినట్లు తెలిపారు.

పర్యవేక్షకుల సూచన మేరకు వీరు తమ సిద్ధాంత గ్రంథాన్ని ఆరు అధ్యాయాలుగా విభజించారు. అవి : సుధామూర్తి జీవన రేఖలు; సుధామూర్తి రచనలు - పరిచయం; అనువాద సాహిత్యం - సుధామూర్తి; సుధామూర్తి రచనలు - పాత్ర చిత్రణ; సమకాలీన సమాజం - సుధా మూర్తి రచనల ప్రాముఖ్యత; సాహితీ లోకంలో సుధామూర్తి స్థానం. ఈ పరిశోధన ద్వారా సామాజిక అవగాహన పెంపొందుతుందని, సాహిత్య దృక్పథంలో అవగాహన పెరుగుతుందని అన్నారు. అదేవిధంగా మహిళా దృక్కోణం, మానవతా విలువల ప్రాధాన్యత, భారతీయ సాంప్రదాయాల మార్మికతలను తెలియజెప్పడం ఈ పరిశోధన ప్రయోజనాలని తెలియజేశారు.

**- సంపత్ కుమార్ బానోజి**



## ముకుంద రామారావు సాహిత్యం - ఒక పరిశీలన


**నారగోని సైదులు,** తెలుగు అధ్యయనశాఖ, బెంగళూరు విశ్వవిద్యాలయం, బెంగళూరు, కర్ణాటక.
సెల్: 9490585645. మెయిల్: saidulu645@gmail.com
**కోర్సు:** Ph.D. **రీసెర్చ్ ఏరియా:** కవిత్వం, కథ, అనువాదం, తులనాత్మకం
**పర్యవేక్షకులు:** ఆచార్య కె. ఆశాజ్యోతి. **పరిశోధనకాలం:** 2020 నుండి 2025


స్పష్టాస్పష్టత, పదౌచిత్యం, భావగాంభీర్యం, పురోగమన శీలత, విశ్వజనీన దృక్పథం వంటి లక్షణాలతో కవితలు రాయడంలో ముకుంద రామారావు గారి ప్రత్యేకత. ఇలా కవితలు రాస్తూనే మరో ప్రక్క కథాసాహిత్యంలోనూ రాణించారు. ఆపైన ప్రపంచ, భారతీయ సాహిత్యాలలో వాసికెక్కిన కవుల కవితలను తెలుగువాళ్లకు పరిచయం చేసిన అనువాదకునిగా ఖ్యాతికెక్కారు. ఇలా సాహిత్యరంగంలో కవిగా, కథకునిగా, అనువాదకునిగా, రచయితగా బహుముఖ ప్రజ్ఞ కనపరిచిన యల్లపు ముకుంద రామారావు గారి పైన అభిమానంతో **2018**లో తెలుగుశాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం పరిధిలో ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ గారి పర్యవేక్షణలో ముకుంద రామారావు రచించిన రాత్రి నదిలో ఒంటరిగా అనే కవితా సంపుటిపై ఎం.ఫిల్ (రాత్రి నదిలో ఒంటరిగా - అధ్యయనం) చేశారు నారగోని సైదులు. అప్పుడే వారి కవిత్వం, కథలు, అనువాదాలను అధ్యయనం చేస్తున్న కాలంలో ముకుంద రామారావు గారి సమగ్ర సాహిత్యం పైన పి.హెచ్.డి చేయాలన్న ఆసక్తి ఏర్పడి **2020**లో తెలుగు అధ్యయన శాఖ, బెంగళూరు విశ్వవిద్యాలయంలో ఆచార్య కె. ఆశాజ్యోతి పర్యవేక్షణలో ముకుంద రామారావు సాహిత్యం - ఒక పరిశీలన అనే సిద్ధాంత గ్రంథ రచనకు పూనుకున్నారు.

ముకుంద రామారావుగారి రచనలన్నింటి పైన వీరు తమ పరిశోధన దృష్టిని నిలిపి పర్యవేక్షకుల సూచనలను అనుసరించి నారగోని సైదులు వారి సిద్ధాంత గ్రంథాన్ని అయిదు అధ్యాయాలుగా విభజించారు. అవి : ముకుంద రామారావు జీవన రేఖలు; ముకుంద రామారావు సాహిత్యం - పరిచయం; ముకుంద రామారావు కవిత్వం, కథలు - వస్తు వైవిధ్యం; ముకుంద రామారావు అనువాదాలు - ఇతివృత్తం; వలస పోయిన మందహాసం తులనాత్మక పరిశీలన (తెలుగు - కన్నడ).

ముకుంద రామారావుగారి సాహిత్యంలో భారతీయ తాత్వికతతో పాటు మహమ్మదీయుల సూఫీ తాత్వికత, బౌద్ధ తాత్వికత, వివిధ భాషలలో ఉండే లోతైన విషయాలు, విశాలమైన దృక్పథం కనిపిస్తుంది. వీటన్నింటి పైన సమగ్రమైన అవగాహన ఏర్పరచుకోవడం వల్ల ఈ పరిశోధన సాధ్యమైందన్నారు

**- సంపత్ కుమార్ బానోజి**

**(మరికొన్ని పరిశోధనల పరిచయం వచ్చే సంచికలో...)**